10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

గురువారం 19 డిసెంబర్ 2024 పేజీలు 8






# ప్రజల సందర్శనార్థం... రాష్ట్రపతి నిలయం

## ఉద్యాన్ ఉత్సవ్ కార్యక్రమంతో సందర్శకులకు ఆహ్లాదాన్ని అందించే దిశగా చర్యలు..

- భారత వ్యవసాయ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ శ్యామ్యుల్ ప్రవీణ్ కుమార్ వెల్లడి..
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం సమీక్షా సమావేశం..
- కలెక్టర్ గౌతమ్‌తో, జాయింట్ సెక్రటరీ శ్యామ్యుల్ ప్రవీణ్ కుమార్ సమావేశంలో పాల్గొన్నారు..
- ఆహ్లాదకర వాతావరణంతో పాటు స్టాల్స్, చిన్న చిన్న కుటీరాలు ఒక పిక్నిక్ స్పాట్‌గా సిద్ధం..
- అగ్రికల్చర్ అథారిటీ ఇనిస్టిట్యూట్, సాంస్కృతిక, టూరిజం శాఖల సమన్వయంతో ఏర్పాట్లు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 18:** ప్రతి సంవత్సరం లాగానే శీతాకాల విడిదికి హైదరాబాద్ వచ్చిన రాష్ట్రపతి తిరిగి వెళ్లిన అనంతరం రాష్ట్రపతి నిలయాన్ని సందర్శంచడానికి ప్రజలకు వీలు కల్పించడం జరుగుతుందని..! అయితే ఈసారి మాత్రం ఒక ప్రధాన ఉద్దేశంతో ఉద్యాన్ ఉత్సవ్ అనే కార్యక్రమంతో సందర్శకులకు ఎంతో ఆహ్లాదాన్ని అందించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు భారత వ్యవసాయ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ శ్యామ్యుల్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మేడ్చల్ మల్కాజిగిరి జల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ గౌతంతో కలిసి జాయింట్ సెక్రటరీ శ్యామ్యుల్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాష్ట్రపతి శీతాకాల విడిది ముగించుకొని వెళ్లిన అనంతరం కొన్నిరోజులు రాష్ట్రపతి నిలయాన్ని ప్రజలు సందర్శించేందుకు అనుమతి ఉంటుందని..! ఈ సారి ఆ సందర్శన కార్యక్రమానికి ఉద్యాన ఉత్సవ్ అనే పేరుతో మరింత ఆహ్లాదకర వాతావరణంతో పాటు స్టాల్స్, చిన్న చిన్న కుటీరాలను ఏర్పాటు చేయడంతో పాటు, ఒక పిక్నిక్ స్పాట్‌గా సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.. అధిక సంఖ్యలు ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అగ్రికల్చర్ అథారిటీ ఇనిస్టట్యూట్ , సాంస్కృతిక, టూరిజం శాఖల సమన్వయంతో ఈ ఏర్పాట్లు చేయాలన్నారు.

**భౌగోళిక వ్యవసాయంపై ప్రజల్లో అవగాహన..**



ప్రత్యేకంగా భౌగోళిక వ్యవసాయం, సమీకరణ వ్యవసాయంపై, అవగాహన కల్పించేలా కుటీరాలను, స్టాళ్లను ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు.. నిర్దేశిత ప్రాంతాలలో నిర్దేశిత పంటలు, వ్యర్థాలతో ఉపయోగాల తయారీ గురించి ప్రజలకు, విద్యార్థులకు తెలిసేలా స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు.. తమ తమ ఇళ్లలో నర్సరీ, గార్డనింగ్ ఎలా చేసుకోవాలో తెలిపేలా చిన్న చిన్న మెళకువలతో స్టాల్స్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు తెలియజేయాలని సూచించారు.. పిక్నిక్ స్పాట్‌లా ఉండే విధంగా, పిల్లలకు ప్లే ఏరియా ఉండేలా చూడాలన్నారు.. ఇంతే కాకుండా చిరుతిండ్లు స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఉద్యాన ఉత్సవ్‌ను తిలకించేందుకు వసతి గృహాల విద్యార్థులను రాష్ట్రపతి నిలయానికి తీసుకువచ్చి ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించి ఒక తీపి గుర్తుగా ఉండిపోయేలా వారి జ్ఞాపకాలలో నిలపాలన్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా ప్రచారం చేయాలన్నారు. అందుకు అనుగుణంగా అవసరమైన త్రాగునీరు, అంబులెన్స్, మోబైల్ టాయిలెట్లు,రవాణా , లైటింగ్ వంటి మౌళిక వసతులను సంబంధిత శాఖల అధికారులు ఏర్పాటు చేయాలన్నారు. సందర్శనకు వచ్చిన ప్రతి ఒక్కరు మంచి అనుభవంతో పాటు మంచి అనుభూతితో తిరిగి వెళ్లేలా ఏర్పాట్లు నిర్వహించాలన్నారు.. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అగ్రికల్చర్ సరవనన్ రాజ్, జాయింట్ సెక్రటరీ ఉదయ్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్, డిఈఒ విజయ కుమారి,హార్టికల్చర్ ఆఫీసర్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ ఫాంహౌస్‌కు రోడ్లు వేసుకున్నారు..

# ఓఆర్ఆర్ అమ్ముకున్నారు



- నాలుగేండ్లలో ఆర్ఆర్ఆర్ పూర్తి
- వచ్చే మార్చిలోగా భూసేకరణ
- కేసీఆర్ ఫాంహౌస్ కోసం 600 కోట్లతో రోడ్లు వేసిండ్రు

**హైదరాబాద్ పెన్ పవర్:** వచ్చే మార్చి నాటికి రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణ కంప్లీట్ చేసి పనులు ప్రారంభిస్తామని, నాలుగేండ్లలో ఆర్ఆర్ఆర్ పూర్తి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో రోడ్లను విధ్వంసం చేశారని ఫైర్అయ్యారు. అసెంబ్లీలో కోమటిరెడ్డి మాట్లాడుతూ 'బీఆర్ఎస్ కు రోడ్లపై అవగాహన లేదు. ఉప్పల్ ఫ్లై ఓవర్ ను ఆరేండ్లు ఖాళీగా పెట్టారు. గత పాలకులకు ఎంతసేపు పైసలు వచ్చే కాళేశ్వరం తప్ప రోడ్లను పట్టించుకోలేదు. కమీషన్ తీసుకుని కూలిపోయే కాళేశ్వరం కట్టారు. మాజీ సీఎం కేసీఆర్

-2 లో

## భూ భారతితో ప్రతి ఎకరాకూ భద్రత





**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ భద్రత కల్పించడమే లక్ష్యంగా భూభా రతి బిల్లును ప్రవేశపెడు తున్నామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. వేలాది పుస్తకాలు చదివిన మేధావి తెచ్చిన ధరణి పోర్టల్‌లో లక్షల సమస్యలు వచ్చాయని అన్నారు. ధరణి పోర్టల్ తో వేలాది మంది రైతులు ఇబ్బందులు పడ్డారని, గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాల దాకా వెళ్లిందని అన్నారు. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్లు ధరణి పరిస్థితి తయారైందని అన్నారు. గత పాలకులు తెచ్చిన ఈ లోప భూఇష్ట చట్టం వల్ల భూ యజమానికి తెలియకుండానే చేతులు దాటి కాళ్ల కింద నేల కదిలిపోయిందని విమర్శించారు.

-2 లో

# భూ భారతితో ప్రతి ఎకరాకూ భద్రత

- మొదటి పేజి తరువాయి

బాధితులు తమ సమస్యలు చెప్పుకున్నా.. పరిష్కారం చేసే మార్గం లేకుండా పోయిందని చెప్పారు. లోపభూయిష్టమైన ఆర్‌వోఆర్ చట్టం–2020ని పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నామని చెప్పారు. లోపాల కారణంగా నాలుగు నెలలు వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని అన్నారు. 18 లక్షల 26వేల ఎకరాలు పార్ట్–బీలో ఉందని, ఏ కారణం చేత ఈ భూమిని పార్ట్–బీలో పెట్టారనేది తెలియడం లేదన్నారు. పాసు బుక్కుల్లో ఉన్న భూములకు, పొజిషన్‌లో ఉన్న భూములకు తేడా కనుక్కోవడానికి చట్టంలో నిబంధనలు రూపొందించామని చెప్పారు. ఈ దేశంలో భూ సంస్కరణలు తెచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వమని, కాంగ్రెస్ అంటేనే ఒక బాధ్యత అని అన్నారు.

ఇచ్చిన మాట ప్రకారమే ధరణిని సాగనంపామని, ఆ స్థానంలో భూభారతి తీసుకొస్తున్నామని అన్నారు. గ్రామం కంఠాలు, ఆబాదీ భూములకు భూభారతి చట్టం పరిష్కారమార్గం చూపుతుందని అన్నారు. సభ్యులు సలహాలు, సూచనలు చేస్తే తీసుకుంటామని పొంగులేటి చెప్పారు. సాదా బైనామాల కింద 9.24లక్షల దరఖాస్తులొచ్చాయని, వాటికింద అభ్యంతరాలు ఏవైనా ఉంటే తెలుపుకునే అవకాశం చట్టంలో కల్పించామని వివరించారు. ప్రతి ఏడాదీ జమా బందీ కార్యక్రమం నిర్వహించేలా చట్టంలో పొందుపరిచామని వివరించారు. అలాగే ప్రభుత్వ ఆస్తులను కాపాడుకునేలా భూభారతి చట్టాన్ని రూపొందించినట్టు మంత్రి చెప్పారు.

### మంచిని స్వీకరిస్తం

ధరణి పోర్టల్ లోని మంచిని స్వీకరిస్తామని, ఎలాంటి భేషజాలకు వెళ్లబోమని మంత్రి పొంగులేటి చెప్పారు. ఇప్పటి వరకు 22,23 సార్లు డ్రాఫ్టులు మార్చి బిల్లును ప్రవేశపెడుతున్నామని వివరించారు. ప్రత్యేక కమిటీ 33 జిల్లాల్లో పర్యటించి అభిప్రాయాలు సేకరించిందని చెప్పారు.

### ప్రతి రైతుకూ భూధార్

భూభారతి చట్టం ప్రకారం.. ప్రతి రైతుకూ భూధార్ కార్డులను అందించనున్నామని మంత్రి పొంగులేటి చెప్పారు. ఒక కోడ్ కేటాయిస్తామని చెప్పారు. దానిని స్కాన్ చేస్తే భూమికి సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. భూభారతి చట్టంలో భూధార్ అంశాన్నీ చేర్చామని వివరించారు.

### ప్రతి ఏటా జమాబందీ

గతంలో భూములకు సంబంధించి జమాబందీ నిర్వహించే వారని, ఇకపై ప్రతి ఏటా జమాబందీ నిర్వహించడం వల్ల రైతులకు తమ భూమి తమ స్వాధీనంలో ఉందనే నమ్మకం ఏర్పడుతుందని ఈవిషయాన్ని కూడా భూభారతి చట్టంలో చేర్చినట్టు మంత్రి పొంగులేటి చెప్పారు.

## కేసీఆర్ ఫాంహౌస్‌కు రోడ్లు వేసుకున్నారు.. ఓఆర్ఆర్ అమ్ముకున్నారు

- మొదటి పేజి తరువాయి

ఫామ్ హౌస్ కోసం నాలుగు లైన్ల రోడ్లను ఆరు వందల కోట్లతో వేసుకున్నారు. లక్ష కోట్ల విలువ చేసే ఓఆర్ఆర్ అమ్ముకున్నారు. హరీశ్‌రావుకు దబాయించడం తప్ప పని చేయడం తెల్వదు. నేను మాట్లాడుతుండగా ఎంత రిక్వెస్ట్ చేసినా కూర్చోవడం లేదు. ఆయనకు కూలిపోయే కాళేశ్వరం కట్టి కమిషన్ తీసుకోవడం మాత్రమే తెలుసు. రోడ్లు వేయడం చాతకాదు.. కూలిపోయే ప్రాజెక్టులు కట్టారు’ అని మండిపడ్డారు.


## కాంగ్రెస్ ఛలో రాజ్ భవన్..




హైదరాబాద్ పెన్ పవర్:పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీ ఆర్థిక అక్రమాలు, మణిపూర్ అల్లర్లపై ఏఐసీసీ ఇచ్చిన మేరకు పీసీసీ ఆధ్వర్యంలో బుధవారం ( డిసెంబర్ 18, 2024 ) చలో రాజ్‌భవన్ కార్యక్రమానికి పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. అదానీ ఆర్థిక అవకతవకలు, నేరారోపణలు, అవినీతి, మోసం, మనీ లాండరింగ్ వంటి అంశాలతో పాటు మణిపూర్ అల్లర్లు, విధ్వంసాలపై మోదీ సర్కార్ వైఖరికి వ్యతిరేకంగా ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చింది ఏఐసీసీ.

ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఏఐసీసీ ఇచ్చిన పిలుపులో భాగంగా చలో రాజ్ భవన్ కార్యక్రమాన్ని పీసీసీ నిర్వహిస్తోంది. హైదరాబాద్ లో ఉదయం 11 గంటలకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహం నుంచి రాజ్ భవన్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఇందులో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, పలువురు మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ ర్యాలీని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

# రాజ్ భవన్ ఎదుట రోడ్డుపై బైఠాయించిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రోడ్డుపై బైఠాయించారు. హైదరాబాద్ సిటీ నడిబొడ్డున.. రాజ్ భవన్ ఎదుట రోడ్డుపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డినే రోడ్డుపై బైఠాయించటం ఆసక్తి రేపింది. ఇంతకీ సీఎం రేవంత్ రెడ్డి.. రోడ్డుపై బైఠాయించటానికి.. నిరసన వ్యక్తం చేయటానికి కారణం ఏంటో తెలుసుకుందాం..అదానీ విషయంపై పార్లమెంట్లో చర్చకు కేంద్రం అంగీకరించకపోవటం.. మణిపూర్ అంశంపై ప్రధాని మోదీ మాట్లాడాలని డిమాండ్ చేస్తూ.. దేశ వ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చింది కాంగ్రెస్. ఈ క్రమంలోనే తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో.. అసెంబ్లీ నుంచి గవర్నర్ రాజ్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించింది పీసీసీ. ఈ ర్యాలీలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. అసెంబ్లీ నుంచి రాజ్ భవన్ చేసుకున్న తర్వాత.. రాజ్ భవన్ ఎదుటనే సీఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు అందరూ రోడ్డుపై బైఠాయించారు. జై కాంగ్రెస్.. జై సోనియాగాంధీ అంటూ నినాదాలు చేశారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా డౌన్ డౌన్ మోదీ అంటూ నినదించారు కాంగ్రెస్ నేతలు. మణిపూర్ అంశంపై మోదీ ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు నేతలు. కేంద్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా.. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వినతిపత్రం సమర్పించారు సీఎం రేవంత్ రెడ్డి. రాష్ట్ర ప్రభుత్వం వైఖరిని కేంద్రానికి తెలియజేయాలని కోరారు. రోడ్డుపై బైఠాయించిన వారిలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు.

# విగ్గు పెట్టి.. డబ్బున్నోడిగా బిల్డప్.. 50 మందితో పెళ్లి.. గచ్చిబౌలి నిత్య పెళ్లి కొడుకు బాగోతం వెలుగులోకి..

**హైదరాబాద్ పెన్ పవర్:** పెళ్లంటే అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు చూసుకుని సంబంధం కుదుర్చుకోవాలని పెద్దలు చెబుతుంటారు. కానీ.. ప్రస్తుతం పరిస్థితులు మారిపోయాయి. మ్యాట్రిమోనీ సైట్లు పెళ్లిళ్లు కుదిర్చి కమీషన్లు దండుకునే రోజులొచ్చేశాయి. అంతా సవ్యంగా ఉండి.. మ్యాట్రిమోనీల్లో కుదుర్చుకున్న సంబంధం సక్సెస్ అయితే కథ సుఖాంతం అవుతుంది. అలా కాకుండా.. మోసగాళ్ల బారిన పడితే లబోదిబోమనాల్సిందే. ఎందుకంటే.. కొందరు ఈజీ మనీ కోసం మ్యాట్రిమోనీ సైట్లను అడ్డాగా మార్చుకుంటున్నారు. అలాంటి కేటుగాడే ఈ వంశీకృష్ణ. హైదరాబాద్ లోని గచ్చిబౌలిలో ఉండే వంశీకృష్ణ తనను తాను ధనవంతుడిగా మ్యాట్రిమోనీ సైట్స్‌లో పరిచయం చేసుకుంటాడు. నెత్తి మీద సరిగ్గా జుట్టే లేకపోయినప్పటికీ విగ్గులు పెట్టుకుని, లుక్ మార్చుతూ ఫొటోలు అప్‌లోడ్ చేస్తాడు. మ్యాట్రిమోనీలో వరుడి కోసం వెతుకుతున్న అమ్మాయిలకు, అమ్మాయి తల్లిదండ్రులకు అందగాడు, డబ్బునోడు అనే ఫీల్ క్రియేట్ చేస్తాడు. మ్యాట్రిమోనీ డాట్‌కామ్‌లో అందమైన ఫొటోలు పెట్టి 'కోట్ల ఆస్తి ఉన్న తనకు



వధువు కావలెను' అని వంశీకృష్ణ ప్రొఫైల్ అప్ లోడ్ చేస్తాడు. నమ్మి అతని వలలో పడిన అమ్మాయిలను పెళ్లి చేసుకుని, లక్షల కట్నం దండుకుని కొన్నాళ్లకు ముఖం చాటేస్తాడు. మరో గెటప్ తో
మళ్లీ ప్రొఫైల్ అప్ లోడ్ చేస్తాడు. ఆ వచ్చిన డబ్బులతో రాయల్ లైఫ్ లీడ్ చేస్తుంటాడు. సింపుల్ గా చెప్పాలంటే.. వంశీకృష్ణ దందా ఇది. ఇలా విగ్‌లు పెట్టుకుని, వేషాలు మారుస్తూ మోసాలకు పాల్పడుతున్న వంశీకృష్ణ దాదాపు 50 మంది అమ్మాయిలను పెళ్లి చేసుకుని మోసం చేశాడు.
ఒక లేడీ డాక్టర్ ను కూడా ఇలానే పెళ్లి చేసుకుని మోసం చేయగా.. ఇతని మోసాన్ని గ్రహించిన ఆ డాక్టర్ తండ్రి ధైర్యం చేసి సైబర్ క్రైం పోలీసులుకు ఫిర్యాదు చేయడంతో ఇతగాడి బాగోతం వెలుగులోకి వచ్చింది. ఇలాంటి నిత్య పెళ్లిళ్ల కేసుల్లోనే ఇప్పటికే పలుమార్లు అరెస్టయి జైలుకు వెళ్లివచ్చినా వంశీకృష్ణ బుద్ధి మాత్రం మారలేదు.

# వన్ నేషన్..వన్ ఎలక్షన్ బిల్ హౌజ్ ప్యానెల్‌లో ప్రియాంకాగాంధీ



**హైదరాబాద్ పెన్ పవర్:** పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వన్ నేషన్ వన్ ఎలక్షన్ రాజ్యాంగ సవరణ బిల్లును మరింత అధ్యయనం చేసేందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ( జేపీసీ)కి కాంగ్రెస్ పార్టీ నుంచి నలుగురు సభ్యులను ఎంపిక చేశారు. వీరిలో వయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ కూడా ఉన్నారు. ఆమెతోపాటు ఎంపీ మనీష్ తివారీ(ఇంకా పరిశీనలో ఉంది), కాంగ్రెస్ నుంచి రణదీప్ సూర్జేవాలా, సుఖ్ దేశ్ భగత్ సింగ్ లను కూడా కమిటీలో చేర్చింది.
మంగళవారం (డిసెంబర్ 17) కేంద్ర కేబినెట్ ఆమోదించిన రెండు బిల్లులు రాజ్యాంగ సవరణ బిల్లు 2024, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు 2024 ఉన్నాయి. ప్రతిపక్షాల వ్యతిరేకతల మధ్య ఈ బిల్లులను కేంద్ర న్యాయ శాఖమంత్రి అర్జున్ మేఘవాల్ లోక్ సభలో ప్రవేశపెట్టారు. ఆ తర్వాత జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపారు. వీటిపై పార్లమెంట్ లో చర్చలు జరగనున్నాయి.

రాజ్యాంగం (129వ సవరణ) బిల్లు 2024 రాజ్యాంగంలోని మూడు ఆర్టికల్‌లను సవరించి , కొత్త ఆర్టికల్ 82%ూ%ని చేర్చాలని ప్రతిపాదించింది. అయితే ఈ బిల్లు భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ)కి అధిక అధికారాలను ఇస్తుందని విపక్షాలు ఆందోళనలలో లేవనెత్తాయి. దీంతో జేపీసీకి పంపారు. గత కొంతకాలంగా దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తోంది.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం..తన అజెండా పెట్టుకంది. పార్లమెంట్, లోక్ సభ, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికలు ఒకేసారి నిర్వహించాలని ఈ వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లును పార్లమెంట్ లో ప్రవేశపెట్టడం జరిగింది.
లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికలను కలిపి నిర్వహించడం తొలిఅడుగు.. స్థానిక సంస్థల ఎన్నికలు 100 రోజుల్లో నిర్వహించాలని మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవిం ద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ ఏక కాల ఎన్నికలపై నివేదిక సిఫారసు చేసింది.

## యూట్యూబర్ ప్రసాద్ బెహర ఇలాంటోడా.. అరెస్ట్ చేసి 14 రోజులు జైలుకు పంపిన పోలీసులు



**హైదరాబాద్ పెన్ పవర్:** లైంగిక వేధింపుల కేసులో తెలుగు యూట్యూబర్, నటుడు ప్రసాద్ బెహరాను పోలీసులు అరెస్ట్ చేశారు. కొన్ని నెలలుగా లైంగికంగా వేధిస్తున్నాడని వెబ్ సిరీస్ యాక్టర్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు అతనిపై చర్యలు తీసుకున్నారు. షూటింగ్ సమయంలో ప్రైవేట్ భాగాలను తాకుతున్నాడని బాధితురాలు ఫిర్యాదు చేసింది. ప్రసాద్ బెహరాను జూబ్లీహిల్స్ పోలీసులు 14 రోజుల రిమాండ్‌కు తరలించారు.'మా విడాకులు', 'పెళ్లి వారమండి', 'దిల్ పసంద్', 'వింధ్యా విహారి' తదితర వెబ్ సిరీస్ లు ప్రసాద్ బెహరాకు మంచి పేరు తీసుకొచ్చాయి. వెబ్ సిరీస్ ల్లో వచ్చిన గుర్తింపుతో ఈ మధ్యే కొన్ని చిన్న సినిమాల్లో కూడా ఇతనికి యాక్టింగ్ అవకాశాలొచ్చాయి. 'కమిటీ కుర్రోళ్లు' సినిమాలో మంచి రోల్ దక్కింది.ఇప్పుడిప్పుడే టాలీవుడ్‌లో అవకాశాలు దక్కుతున్న ఈ సమయంలో ప్రసాద్ బెహరా అరెస్ట్ కావడం, అదీ లైంగిక వేధింపుల కేసులో అరెస్ట్ కావడం అతని కెరీర్‌కు పెద్ద దెబ్బేనని చెప్పక తప్పదు. తెలుగులో యూట్యూబర్లు లైంగిక వేధింపుల కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొన్న ఘటనలు ఇప్పటికే చాలా చూశాం. యూట్యూబర్ హర్ష సాయి, షణ్ముక్ జశ్వంత్, పక్కింటి కుర్రాడు 'చందు సాయి' ఇలా లైంగిక వేధింపుల కేసుల్లో, డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కుని జీవితాలను ఆగం చేసుకుంటున్న ఘటనలు ఈ మధ్య చాలానే వెలుగుచూశాయి.

## అమిత్ షా సిగ్గు లేకుండా, మతితప్పి మాట్లాడారు.. హెూంమంత్రి పదవికి రాజీనామా చెయ్యాలి



**హైదరాబాద్ పెన్ పవర్:** మంగళవారం ( డిసెంబర్ 17, 2024 ) రాజ్యసభలో అంబేద్కర్ ను ఉద్దేశించి కేంద్ర హెూంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ. అమిత్ షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని.. దళితులంతా ఏకమై అమిత్ షా కు చెంపపెట్టులాంటి సమాధానం ఇవ్వాలని అన్నారు వంశీకృష్ణ. అమిత్ షా సిగ్గు లేకుండా, మతితప్పి మాట్లాడారని.. ఇలాంటి సంకుచిత మనస్తత్వం తో మాట్లాడే వ్యక్తి దేశానికి హెూంమంత్రి గా పనిచేయడం దౌర్భాగ్యమని అన్నారు.దేవుడి పేరు కూడా అంబేద్కర్ పేరు లాగా జపం చేస్తే స్వర్గానికి పోతామంటూ చిన్నచూపుగా మాట్లాడారని.. హెూంమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని అన్నారు. అమిత్ షా దళితులకు భేషరత్ గా క్షమాపణలు చెప్పి, తన హెూంమంత్రి పదవికి రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేశారు వంశీకృష్ణ. అమిత్ షా కు జైలుకు వెళ్లివచ్చిన రోజులను ప్రజలు మళ్ళీ గుర్తు చేయాలని అన్నారు.

## తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన దిల్ రాజు




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్‌డీసీ) చైర్మన్‌గా ప్రముఖ నిర్మాత దిల్ రాజు బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఆయనను టీఎఫ్‌డీసీ చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈరోజు ఆయన బాధ్యతలు చేపట్టారు. కుటుంబ సభ్యులతో కలిసి ఛాంబర్‌కు వచ్చిన ఆయన పదవీ బాధ్యతలను స్వీకరించారు.టీఎఫ్‌డీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ... టీఎఫ్‌డీసీకి పూర్వ వైభవం తీసుకురావాలని, అందుకు అందరి సహకారం అవసరమన్నారు. తెలంగాణ సంస్కృతిని ఆధారంగా చేసుకొని సినిమాలు వచ్చేలా చూడాలన్నారు. సినిమా పరిశ్రమ మద్రాస్ నుంచి హైదరాబాద్ వచ్చిన తర్వాత తెలుగు సినిమా పరిశ్రమ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు.ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా మరెంతో అభివృద్ధి చెందాలన్నారు. టీఎఫ్‌డీసీ చైర్మన్‌గా తనపై ఎంతో బాధ్యత ఉందని, ప్రభుత్వానికి, చిత్ర పరిశ్రమకు మధ్య వారధిగా పని చేస్తానన్నారు. పరిశ్రమలోని అన్ని విభాగాల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. టీఎఫ్‌డీసీ చైర్మన్‌గా అవకాశమిచ్చినందుకు సీఎం రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## అసెంబ్లీ బయట డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు పెట్టాలి.. హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అసెంబ్లీలోకి వచ్చే సభ్యులకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కొందరు సభ్యులు ఉదయమే డ్రింక్ చేసి సభకు వస్తున్నారని ఆరోపించారు. సభలోకి వచ్చి ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదన్నారు. అందుకే అసెంబ్లీ బయట డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు పెట్టాలని సభాపతిని హరీశ్‌రావు కోరారు.

# వరనాడ్ వరదలు: హెలికాప్టర్లతో కాపాడినందుకు 132 కోట్లు కట్టాలా.. బాబ్బాబు కొంచెం తగ్గించుకోండి




**హైదరాబాద్ పెన్ పవర్:**ఇటీవల కేరళలో కొండచరియలు విరిగిపడి విధ్వంసం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ విధ్వంసంలో అనేకమంది ప్రాణాలు కోల్పోయారు.. వందలాది ఇండ్లు తుడిచిపెట్టుకుపోయాయి..గ్రామాలు గ్రామాల్లో కనిపించకుండా పోయాయి. ఇప్పటికీ కొండచరియల విధ్వంసం నుంచి ఆ గ్రామాల ప్రజలు కోలుకోలేదు. మరోపక్క కేరళ ప్రభుత్వం వారిని ఆదుకునేందుకు ప్రయత్నం చేస్తూనే ఉంది.. విపత్త సమయంలో కేంద్ర మిలిటరీ బలగాలు సహాయక చర్యల్లో పాల్గొన్న విషయం తెలిసిందే..అయితే ఎయిర్ లిఫ్టు ఛార్జీలను మినహాయించాలని కేరళ ప్రభుత్వం హైకోర్టును అభ్యర్థించింది. దీంతో కేంద్రానికి కేరళ హైకోర్టు కీలక సూచనలు చేసింది.

కేంద్ర ప్రభుత్వానికి కేరళ హైకోర్టు కీలక సూచనలు చేసింది. కేరళలోని విపత్తుల సమయంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ నిర్వహించిన రెస్క్యూ ఆపరేషన్లకోసం ఎయిర్ లిఫ్ట్ ఛార్జీలుగా డిమాండ్ చేసిన రూ. 132 కోట్లు నుంచి రూ. 120 కోట్లు మానవతా దృక్పథంతో మినహాయించాలని కేరళ హైకోర్టు బుధవారం (డిసెంబర్ 18) న కేంద్రానికి సూచించింది.

రూ. 120 కోట్లు మినహాయిస్తే వయనాడ్ లోని కొండ చరియల బాధితులకు పునరావాసం కల్పించేందుకు కేటాయించవచ్చని జస్టిస్ ఏకే జయశంకరన్ నంబియార్ , ఈశ్వరన్ ఎస్ లతో కూడిన డివిజన్ బెంచ్ సూచించింది. జనవరి 10, 2025 నాటికి ఈ అంశంపై స్పందించాలని తెలిపింది. 2006 నుంచి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ రెస్క్యూ ఆపరేషన్లకు సంబంధించిన రూ.132కోట్ల బిల్లు కేరళ ప్రభుత్వం బకాయి పడింది.ముఖ్యంగా వయనాడ్ జిల్లాలో మూడు గ్రామాల్లో కొండచరియలు విరిగిపడి జరిగిన విధ్వంసం సమయంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ తీవ్రంగా శ్రమించి బాధితులకు సహాయం అందించింది. అక్టోబర్ 22, 2024 నాటికి ఎయిర్ లిఫ్ట్ ఛార్జీ లసెటిల్ మెంట్ కు సంబంధించి కేరళ ప్రభుత్వానికి కేంద్రం బిల్లుల వివరాలు పంపించింది. 2018లో వరదల సమయంలో నిర్వహించిన రెస్క్యూ ఆపరేషన్లకు సంబంధించిన బకాయిలు రూ.100కోట్లు, జూలై లో వయనాడ్ జిల్లాలో కొండచరియిలు విరిగిపడి విధ్వంసం సృష్టించిన సమయంలో రెస్క్యూకోసం రూ. 13కోట్ల బిల్లులు ఉన్నాయి.

కేరళ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎస్‌డిఆర్ఎఫ్) ఖాతాలో ప్రస్తుతం రూ. 61 కోట్లనిధులు ఉన్నాయి. రూ.120 కోట్లు విడుదల చేస్తే వాయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన బాధితులకు పునరావాసం కల్పించేందుకు తక్షణ సాయం రూ.180 కోట్లు అందుతుందని కోర్టు స్పష్టం చేసింది.

# 'సీఎం పర్యటనలో ప్లేట్ భోజనం ఖర్చు రూ.32,000'పై స్పందించిన కేటీఆర్

- ఏడాది కాంగ్రెస్ పాలనలో ఒరగబెట్టిందేమీ లేదన్న కేటీఆర్
- లక్షల కోట్ల అప్పులు చేశారని, ఆ డబ్బు ఏమైందని నిలదీత
- రూ.32 వేల ప్లేట్ భోజనం అరగాలి కదా అంటూ చురక



**హైదరాబాద్ పెన్ పవర్:**వేములవాడ పర్యటన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల భోజనాల ఖర్చు నిమిత్తం ఒక్కో ప్లేటుకు రూ.32 వేలు ఖర్చు చేసినట్టు వచ్చిన వార్తలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఒక్కో ప్లేటుకు రూ.32 వేల చొప్పున మొత్తం 100 మందికి రూ.32 లక్షల బిల్లు అయినట్లు వార్త వచ్చింది. ఈ అంశంపై కేటీఆర్ మండిపడ్డారు.

ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒరగబెట్టిందేమీ లేదన్నారు. కానీ లక్షల కోట్ల రూపాయల అప్పు చేశారని, ఆ డబ్బు ఎక్కడకు వెళ్లిందని నిలదీశారు.ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ పర్యటన సందర్భంగా సీఎం, మంత్రుల భోజనాల ఖర్చు నిమిత్తం ఒక్కో ప్లేటుకు రూ.32 వేలు ఖర్చు చేసినట్లు వచ్చిన వార్తా కథనాన్ని తన ట్వీట్‌లో జత చేస్తూ... కాంగ్రెస్ ప్రభుత్వ అడ్డగోలు అప్పులు, ఖర్చులను చేస్తోందని ధ్వజమెత్తారు.

ఒక్క ఇటుకను పెట్టలేదు, గుప్పెడు మన్ను కూడా తీయలేదని.. కానీ లక్ష ఇరవై మూడు వేల కోట్ల అప్పు ఎందుకు చేశారని ప్రశ్నించారు. అప్పు సరే కానీ భోజనాలు బాగా అయ్యాయా? అని వేములవాడ పర్యటన సందర్భంగా రేవంత్ సర్కార్ చేసిన ఖర్చును ప్రస్తావించారు. అందరూ కడుపునిండా తిన్నారా..? తిన్నాక పాన్ వేసుకున్నారా..? రూ.32,000 ప్లేట్ భోజనం అంటే అరగాలి కదా? అని ఎద్దేవా చేశారు.

# శీతాకాలంలో వ్యాయామం చేస్తే గుండెపోటు రాదా?

- చలికాలంలో రక్తనాళాలు సంకోచించడంతో హృదయనాళ వ్యవస్థపై ఒత్తిడి
- హృదయ సంబంధ సమస్యలకు ఎక్కువ అవకాశం
- వ్యాయామంతో గుండె ఆరోగ్యం పదిలం అంటున్న వైద్య నిపుణులు



**హైదరాబాద్ పెన్ పవర్:** శీతాకాలం కావడంతో దేశవ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చలి బాగా ముదిరింది. ఇలాంటి వాతావరణంలో శారీరక చురుకుదనం గణనీయంగా తగ్గుతుంది. చలిని తట్టుకోవడానికి స్వెటర్లు ధరించినా, వెచ్చని పానీయాలు తాగినా... శరీరం చురుకుగా లేకపోతే గుండె సంబంధిత వ్యాధుల ముప్పు అధికంగా ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరాన్ని యాక్టివ్‌గా ఉంచుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడంతో పాటు వ్యాయామం చేయడం అత్యంత ముఖ్యమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. చలికాలంలో రక్తనాళాలు సంకోచించడంతో హృదయనాళ వ్యవస్థపై ఒత్తిడిని పెంచుతుందని, ఫలితంగా గుండెపోటు, గుండె సంబంధిత ఇతర సమస్యలు వచ్చే ముప్పు ఎక్కువగా ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. శరీరంలో అంతర్గతంగా అవసరమైన ఉష్ణోగ్రత ఉండేలా చూసుకోవడం
చాలా కీలకమని, చల్లటి వాతావరణం ఉన్నప్పుడు శరీరం సులభంగా వేడిని కోల్పోతుంది కాబట్టి వ్యాయామం చేయడం చాలా ఉత్తమమని సూచిస్తున్నారు.

శీతాకాలంలో వ్యాయామం ప్రయోజనాలు ఇవే

శీతాకాలంలో వ్యాయామం చేస్తే శరీరం బిగుతుగా, దృఢంగా ఉంటుంది. రోజువారీ వ్యాయామం శరీరాన్ని చురుకుగా ఉంచడమే కాకుండా కీళ్ల చుట్టూ ఉండే కండరాలను ఫ్లెక్సిబుల్‌గా ఉంచుతుంది. శరీర బరువు సమతుల్యతకు బాగా ఉపయోగపడుతుంది. అత్యంత కీలకమైన రక్త ప్రవాహాన్ని కూడా వ్యాయామం ప్రోత్సహిస్తుంది. శరీరంలోని అన్ని అవయవాలకు రక్త ప్రసరణ జరగడంలో దోహద పడుతుంది. శరీరంలో అవసరమైన వేడిని కొనసాగించడంతో పాటు గుండెపై ఒత్తిడిని తగ్గించడంలోనూ వ్యాయామం కీలక పాత్ర పోషిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.
అంతేకాదు, సూర్యకాంతి ద్వారా విటమిన్–డీ కూడా పుష్కలంగా లభిస్తుంది. అంతేకాదు రోగనిరోధక శక్తి పెరుగుదల, పలు రోగాలను నిరోధించడంలో కూడా ఎక్సర్‌సైజ్ చక్కగా ఉపయోగపడుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# అమలుకానీ హామీలిచ్చి ఆటో కార్మికుల ఓట్లు దండుకున్న రేవంత్

ఆటో కార్మికులకు అండదండగా నిలుస్తా
మాజీ మంత్రి సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత రాష్ట్ర సమితి కార్మిక విభాగం(బి.ఆర్.ఎస్.కె.వి)ఆటో యూనియన్ కార్మికులు ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆదేశం మేరకు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్.బి.ఆర్. అంబేద్కర్ కి వినతి పత్రం సమర్పించి కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని వేడుకున్నారు. రేవంత్ రెడ్డి ఆటో యూనియన్ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని ప్రతికార్మికునికి సంవత్సరానిక 12000రూపాయలు అందిస్తానని,పిల్లల చదువుల కోసం ప్రత్యేక స్కీమ్ ల ద్వారా ఉన్నత విద్య కల్పిస్తామని,ఇండ్లు లేని కార్మికులకు ఇంటి స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తామని హామీలు ఇచ్చి గాలికి వదిలేశారు అని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలు నెరవేర్చేలేని ప్రభుత్వం ఫ్రీ బస్సులు పెట్టీ తమ బతుకులు బజారు పాలుజేసారని వాపోయారు.

ఈ ప్రభుత్వానికి,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జ్ఞానోదయం కలిగించి ఇచ్చిన హామీలు అమలు చేయాలని హితబోధ చేయాలని కోరారు.

వినతి పత్రం సమర్పించిన అనంతరం గౌరవ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నీ కలసి తమకు ఆర్.టి.ఓ,పోలీస్,ఆర్.టి.సి అధికారుల నుండి వేధింపులు అధికమయినాయని మాకు సహకరించి అధికారులతో మాట్లాడ లని విజ్ఞప్తి చేయగా స్పందించిన మాజీ మంత్రి మీకు అండ దండగా ఉంటానని ప్రతి విషయములో ఖచ్చితంగా సహకరిస్తానని అధికారులతో మాట్లాడి మీకు ఇబ్బంది కలగకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు ప్రేమ్ నాథ్ రెడ్డి,కౌన్సిలర్స్ బండారు కృష్ణ నాగన్న యాదవ్ కంచె.రవి,గంధం.పరంజ్యోతి, ఇమ్రాన్,సూర్యవంశపు.గిరి, చిట్యాల.రాము సునీల్ వాల్మీకి, ముద్దుసార్, ఆలీమ్మ్,రామస్వామి,తోట.శ్రీనుతో పాటు ఆటో యూనియన్ అధ్యక్షులు తాత రాములు,ప్రధాన కార్యదర్శి జంగిడీ.వెంకటయ్య ,యాదయ్య,అనిల్ కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పెబ్బేర్ జాతీయ రహదారిపై దారి దోపిడి

**హైదరాబాద్ పెన్ పవర్:** పెబ్బేర్ 44 నెంబర్ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున దొంగలు హల్చల్ చేశారు... తీర్థయాత్రలకు వెళ్లి విశ్రాంతి కోసం రోడ్డు పక్కకు ఆపి ఉంచడంతో వాహనంపై దొంగలు యాతికులపై రాళ్లతో దాడి చేసి బంగారు నగల్ని దోచుకొని పరార్ అయ్యారు... హుటాహుటిన సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని బాధితులను ఆసుపత్రికి తరలించి దొంగల కోసం వేట మొదలుపెట్టారు...

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కూజన్ కొత్తూరు గ్రామానికి చెందిన 3 కుటుంబాలకు చెందిన 8 మంది తిరుపతి, అరుణాచలం తదితర తీర్థయాత్రలకు వెళ్లి తిరిగివస్తూ ప్రయాణం చేసి అలసిపోగా నిద్రపోదామని పెబ్బేరు శివారులోని పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా ఉన్న భారీ వాహనాలు నిలుపు స్థలంలో ఆపుకొన్నారు. తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో కొందరు దుండగులు అకస్మాత్తుగా కత్తులు, రాళ్లతో దాడి చేసి వెహికిల్లో ఉన్న 8 మంది వద్ద 14 తులాల బంగారు చోరీ చేశారు. వెహికిల్ టాప్ పైన ఉన్నా బ్యాగులను ఎత్తుకెళ్లారు. వాహనం లో ఉన్న వారు దుండగులపై ప్రతి దాడి చేయగా దుండగులు వీరిపై రాళ్ళతో కొట్టి పరారైపోయారు... వెంటనే తేరుకొని బాధితులు 100 కు డయల్ చేశారు..స్పందించిన పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. ముగ్గురు తీవ్రంగా గాయపడగా మహిళలకు మెడలపై గాట్లు పడి స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ చేరుకొని ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ తో రక్తపు మరకలు, వేలిముద్ర లు వంటి వివరాలను సేకరించారు.

# వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ముందు పెన్షన్లు పెంచుతాం

**కాంగ్రెస్ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు**

**హైదరాబాద్ పెన్ పవర్:** అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందు పెన్షన్లు పెంచుతాం.. అప్పటివరకూ పెంచమని మహబూబ్నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేసారు. రుణమాఫీ, ఫ్రీ బస్సుతో రైతులు, మహిళలు సంతోషంగా ఉన్నారని అయన అన్నారు.

# సినిమా పరిశ్రమకు అన్నివిధాలుగా అండగా ఉంటా

**దిల్ రాజ్ పదవి ప్రమాణస్వీకార కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ గా వి. వెంకట రమణ రెడ్డి ఏ దిల్ రాజు నేడు ఉదయం పదవీ భాధ్యతలు స్వీకరించారు. మాసాబ్ ట్యాంక్ లోని ఎఫ్.డీ.సి కార్యాలయంలో నేడు ఉదయం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పదవీ భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్బంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కార్యక్రమానికి హాజరై దిల్ రాజ్ ను అభినందించారు. తెలంగాణా లో ఫిలిం ఇండస్ట్రీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ఇండస్ట్రీ కి చెందిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వడంలో దిల్ రాజు సేవలు ఎంతగానో ఉపయోగపడతాయాని ఈ సందర్బంగామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీ కి చెందిన షూటింగ్స్ తెలంగాణా లో మరింత ఎక్కువగా జరిగే విధంగా ప్రయత్నిస్తానని కృషి చేస్తానని దిల్ రాజ్ పేర్కొన్నారు.

## ముంబైలో విషాదం.. సముద్రంలో బోటు ప్రమాదం.. 'ఎలిఫెంటా కేవ్స్'కు 80 మందితో వెళుతుండగా ఘటన




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆర్థిక రాజధాని ముంబై నగరంలో విషాద ఘటన జరిగింది. ముంబైలోని 'గేట్ వే ఆఫ్ ఇండియా' ప్రాంతం నుంచి 'ఎలిఫెంటా కేవ్స్'కు 80 మందికి పైగా ప్రయాణికులతో వెళుతున్న ఫెర్రీ బోట్ ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. 80 మందిలో 77 మందిని రెస్క్యూ టీం సురక్షితంగా కాపాడింది. బుధవారం సాయంత్రం 3.15కి ముంబై 'గేట్ వే ఆఫ్ ఇండియా' ప్రాంతం నుంచి ఈ 'నీల్ కమల్' బోట్ ప్రయాణికులతో బయల్దేరింది. 3.55 సమయంలో ఈ బోట్‌ను ఒక చిన్న స్పీడ్ బోట్ ఢీ కొట్టింది. ఇండియన్ నేవీ తక్షణమే స్పందించి సహాయక చర్యలు ముమ్మరం చేసింది. సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ మొదలుపెట్టింది. కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసుల సహకారంతో రెస్క్యూ ఆపరేషన్ చేసి బోటులో ఉన్న 80 మందిలో 77 మందిని సురక్షితంగా సముద్రం నుంచి బయటకు తరలించారు. ఈ బోట్ ప్రమాదానికి సంబంధించిన రెస్క్యూ ఆపరేషన్ వీడియోలు నెట్టింట వైరల్ గా మారాయి. 11 నేవీ బోట్లు, మూడు మెరైన్ పోలీస్ బోట్స్, ఒక కోస్టల్ గార్డ్ వెసెల్ తో పాటు నాలుగు హెలికాప్టర్లు రెస్క్యూ ఆపరేషన్ లో భాగం కావడం గమనార్హం.

## పదేళ్ళ తర్వాతనే జమిలీ ఎన్నికలు

- కేంద్రం పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు 2029 నుంచి అమలు
- 2029లో పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఐదేళ్ళకు అసెంబ్లీ, పార్లమెంట్ కు ఒకేసారి ఎన్నికలు
- ఆరు మాసాల పాటు రాష్ట్రపతి పాలన ఉండే అవకాశం

**హైదరాబాద్ పెన్ పవర్:** జమిలీ ఎన్నికల బిల్లు అమలైతే తెలంగాణలో ఆరు మాసాల పాటు రాష్ట్రపతి పాలన తప్పదా?... మరో 9 ఏళ్ల తర్వాత తెలంగాణకు ఆ పరిస్థితి రానుందా? అంటే అవుననే సమాధానం వస్తుందని బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపి బోయినిపల్లి వినోద్ కుమార్ అన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు 2029లో జరిగే పార్లమెంట్ ఎన్నికల తర్వాత అమల్లోకి రానుంది. అంటే అప్పటి వరకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ప్రస్తుతం ఎలా జరిగాయో అలానే జరుగుతాయని వినోద్ కుమార్ తెలిపారు. 2029 తరువాత జరిగే అసెంబ్లీ ఎన్నికలు మాత్రం 2034లో పార్లమెంట్ ఎన్నికలతోనే అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల కంటే ఆరు మాసాల ముందుగా అసెంబ్లీ ఎన్నికలు జరిగిన నేపథ్యంలో 2028లో ఏర్పడే అసెంబ్లీ 2033లో ముగుస్తుందని, దాదాపు 6 మాసాల పాటు తెలంగాణలో రాష్ట్రపతి పాలన ఉండే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.

## 73ఏళ్ల భార్యకు 70ఏళ్ల భర్త విడాకులు.. వ్యవసాయ భూమి అమ్మి రూ.3.7 కోట్ల భరణం ఇచ్చిన రైతు!




**హైదరాబాద్ పెన్ పవర్:** హర్యానాలోని కర్నాల్ జిల్లాలో 70ఏళ్ల వృద్ధ దంపతులు విడాకులు తీసుకున్న ఘటన నెట్టింట చర్చనీయాంశంగా మారింది. ఉన్నదంతా అమ్మి మరీ రూ.3.7 కోట్ల భరణంతో 44 ఏళ్ల వివాహ బంధానికి స్వస్తి పలికాడా రైతు. ఈ దంపతులు గత 18ఏళ్లుగా విడివిడిగా జీవిస్తుండగా.. తాజాగా విడాకులతో వీరి పెళ్లి బంధానికి ఎండ్‌కార్డ్ పడింది. వివరాల్లోకి వెళితే.. కర్నాల్ జిల్లాకు చెందిన 70 ఏళ్ల రైతు సుభాశ్ చంద్, 73 ఏళ్ల సంతోష్ కుమారికి 1980 ఆగస్టు 27న వివాహం జరిగింది. వీరికి నలుగురు సంతానం. అయితే కాలం గడిచేకొద్దీ దంపతుల మధ్య మనస్పర్థల కారణంగా దూరం పెరుగుతూ వచ్చింది. ఈ క్రమంలో 2006 నుంచి ఇద్దరూ విడివిడిగా జీవించడం ప్రారంభించారు.

ఈ క్రమంలో భార్య సంతోష్ కుమారి తనను మానసికంగా హింసిస్తోందని భర్త సుభాశ్ చంద్ 2013లో ఫ్యామిలీ కోర్టులో విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేశాడు. అయితే, కోర్టు ఈ పిటిషన్‌ను తిరస్కరించింది.

అనంతరం ఆయన పంజాబ్, హర్యానా హైకోర్టును ఆశ్రయించాడు. అక్కడ కేసు 11 సంవత్సరాల పాటు కొనసాగింది. ఈ క్రమంలో 2024 నవంబర్ 4న ఇరువర్గాల మధ్య మధ్యవర్తిత్వం జరిగింది. దాని ప్రకారం భార్య, ముగ్గురు పిల్లలకు రూ.3.7 కోట్లు శాశ్వత భరణం చెల్లించి తన వివాహాన్ని రద్దు చేసుకోవడానికి భర్త అంగీకరించాడు.

దీన్ని శాశ్వత భరణంగా పరిగణిస్తామని ఒప్పందంలో స్పష్టం చేశారు. భార్య కూడా అందుకు ఒప్పుకుంది. ఆ ఒప్పందం ప్రకారం భార్య, పిల్లలు సుభాశ్ చంద్ ఆస్తిపై అన్ని హక్కులను వదులుకున్నారు. ఇక పరస్పర నిర్ణయాన్ని అంగీకరించిన హైకోర్టు గత వారం విడాకులు మంజూరు చేసింది.

ఇక సుభాశ్ చంద్ ఒప్పందం ప్రకారం భరణం చెల్లించడానికి తన వ్యవసాయ భూమిని రూ.2.16కోట్ల డిమాండ్ డ్రాఫ్ట్ ను భార్యకు ఇచ్చాడు. అలాగే పంట విక్రయాల ద్వారా వచ్చిన రూ.50 లక్షల నగదు, రూ.40 లక్షల బంగారు, వెండి ఆభరణాలు అతని సెటిల్‌మెంట్‌లో ఉన్నాయని సుభాశ్ చంద్ తరఫు న్యాయవాది రాజిందర్ గోయెల్ వివరించారు. న్యాయమూర్తులు సుధీర్ సింగ్, జస్జిత్ సింగ్ బేదీలతో కూడిన హైకోర్టు ధర్మాసనం ఈ ఒప్పందాన్ని చెల్లుబాటు చేసి వివాహాన్ని అధికారికంగా రద్దు చేసింది.

## అమెరికాలో పనిచేయాలని కలలు కనే భారతీయ ప్రొఫెషనల్స్‌కు శుభవార్త!

- విదేశీ నిపుణులను సులభంగా నియమించుకునే వెసులుబాటు
- ఎఫ్-1 స్టూడెంట్ వీసాను హెచ్-1బీ వీసాగా మార్చుకునే అవకాశం
- డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ నిబంధనల్లో పలు మార్పులు
- వచ్చే ఏడాది జనవరి 17 నుంచి అమల్లోకి




**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా వెళ్లాలని, అక్కడ ఉద్యోగాలు చేయాలని కలలు కనే భారతీయులకు జో బైడెన్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. విదేశీ నిపుణులను మరింత సులభంగా నియమించుకునే అవకాశాన్ని అక్కడి కంపెనీలకు కల్పిస్తూ నిబంధనల్లో మార్పులు చేసింది. అలాగే, ఎఫ్-1 స్టూడెంట్ వీసాలను హెచ్-1బీ వీసాలుగా మార్చుకునే అవకాశం కల్పించింది. ఫలితంగా లక్షలాదిమంది భారతీయ ప్రొఫెషనల్స్‌కు ప్రయోజనం చేకూరనుంది.

అమెరికాలోని ఐటీ కంపెనీలు హెచ్-1బీ వీసా (నాన్ ఇమిగ్రెంట్) సాయంతో విదేశీ నిపుణులను నియమించుకుంటాయి. ఈ వీసా ద్వారా భారత్, చైనా దేశాలు భారీగా లబ్ధి పొందుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ నిబంధనల్లో మార్పులు చేసి అవసరాలకు తగ్గట్టుగా విదేశీ ఉద్యోగులను నియమించుకునే అవకాశాన్ని అక్కడి కంపెనీలకు కల్పించింది.

ఈ కొత్త విధానంలో లేబర్ కండిషన్ అప్లికేషన్ కచ్చితంగా హెచ్-1బీ వీసా పిటిషన్‌కు అనుగుణంగా ఉండాలి. వచ్చే ఏడాది జనవరి 17 నుంచి ఈ నిబంధన అమల్లోకి వస్తుంది. తాజా మార్పులతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులను నియమించుకునే అవకాశం యజమానులకు లభిస్తుందని హోంల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ అలెంజాద్రో ఎన్ మేయోర్కాస్ తెలిపారు.

# లగచర్లలో కలెక్టర్‌పై దాడి కేసులో పట్నంతో పాటు 24 మందికి బెయిల్

**హైదరాబాద్ పెన్ పవర్:**లగచర్ల ఘటనలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, ఆయన అనుచరుడు భోగ మోని సురేష్ తో సహా 24 మందికి నాంపల్లి స్పెషల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. లగచర్లలో వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ పై దాడి కేసులో నెల రోజులకు పైగా నిందితులు జైల్లోనే ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సహా నిందితులకు నాంపల్లి స్పెషల్ కోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది.



లగచర్లలో ఆరోజు అసలేం జరిగిందంటే..

వికారాబాద్ జిల్లా దుద్యాల, లగచర్ల, పోలేపల్లిలోని 1,350 ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్‌ఏర్పాటు కోసం ప్రభుత్వం కసరత్తు చేసింది. మొదట ఫార్మా విలేజ్‌ఏర్పాటు చేద్దామని అనుకున్నా స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో ఇండస్ట్రియల్‌కారిడార్‌ఏర్పాటుకు నిర్ణయించింది. ఇందులో భాగంగానే దుద్యాలలో అధికారులు గ్రామసభ, ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం కోసం వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్, సబ్‌కలెక్టర్‌ఉమాశంకర్ ప్రసాద్, కడా స్పెషల్‌ఆఫీసర్ వెంకట్‌రెడ్డితో పాటు ఇతర అధికారులు వచ్చారు. అయితే, గ్రామసభకు ఒక్క రైతు కూడా హాజరు కాలేదు. గంట సేపటివరకూ వారి కోసం వేచి చూసినా రాలేదు. అప్పుడే కలెక్టర్ ప్రతీక్ జైన్ దగ్గరకు బీఆర్‌ఎస్ లీడర్ మొగవోని సురేశ్‌వచ్చారు. 'సార్.. రైతులందరూ లగచర్లలో ఉన్నారు. అక్కడే టెంట్ వేశాం. మీరు అక్కడికి వస్తే మాట్లాడొచ్చు' అని నమ్మించాడు. దీంతో కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, సబ్‌కలెక్టర్, కడా స్పెషల్ ఆఫీసర్‌వారి వారి కార్లలో 5 కిలోమీటర్ల దూరంలోని లగచర్లకు వెళ్లారు. గ్రామంలోని రామాలయం దగ్గరకు వెళ్లిన కలెక్టర్, ఇతర అధికారులు కారు దిగి, రైతులతో మాట్లాడడం మొదలెట్టారు. వెంటనే ఓ పక్క నుంచి 20 నుంచి 30 మంది వరకు కలెక్టర్‌పైకి తోసుకుంటూ వచ్చారు. దాడికి దిగుతున్నారని గుర్తించిన వ్యక్తిగత సెక్యూరిటీ సిబ్బంది, డ్రైవర్.. కలెక్టర్‌ను కారు దగ్గరకు తీసుకెళ్లారు. ఇదే సమయంలో ఇతర అధికారులపై దాడి చేయబోతున్నారని గమనించిన కలెక్టర్.. వారిని కాపాడేందుకు ముందుకు వచ్చారు. అప్పటికే రైతులు, గ్రామస్తులు రాళ్లు, కర్రలతో దాడి చేయడం మొదలుపెట్టారు. వెంటనే కలెక్టర్ ను ఆయన సెక్యూరిటీ సిబ్బంది, డ్రైవర్ కారు ఎక్కించి ముందుకు తీసుకువెళ్లబోయారు. ఈ దశలో ఆయన వాహనంపై దాడి చేశారు. వెనుక అద్దాలపై రాళ్లు వేయడంతో, అవి పగిలిపోయాయి. అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్, స్పెషల్‌ఆఫీసర్ వెంకట్ రెడ్డి దొరకడంతో వారిని ఇష్టమున్నట్టు కొట్టారు. కర్రలు, రాళ్లతో దాడి చేయడంతో వారు గాయపడ్డారు. దాడి చేస్తున్న వారి నుంచి తప్పించుకోవడానికి సమీపంలోని వరి చేన్లలోకి పరుగులు తీశారు. అయినా వదలకుండా వెంటపడ్డారు. అప్పుడే దుద్యాల నుంచి మిగతా పోలీసులు రావడంతో ప్రాణాలతో బయటపడగలిగారు.

## ఆర్యవైశ్యుల సంక్షేమానికి పథకాలు రూపొందించాలని ఆదేశించాం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**హైదరాబాద్ పెన్ పవర్::** ఆర్యవైశ్యుల సంక్షేమానికి కొన్ని పథకాలు రూపొందించాలని సంబంధిత కార్పొరేషన్ను ఆదేశించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ వైశ్యుల సంక్షేమం అభివృద్ధి కోసం కార్పొరేషన్ ఏర్పాటు, ఖర్చు చేసిన నిధుల వివరాలపై ప్రశ్నించగా

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమాధానం ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆర్యవైశ్యుల అభివృద్ధి సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేశామని. కార్యాలయం ఏర్పాటు, జీతభత్యాల కోసం 36 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం స్వయం ఉపాధి, ఇతర సంక్షేమ కార్యక్రమాల కోసం కొన్ని పథకాలు డిజైన్ చేయాలని ఆదేశించాం అన్నారు. అవి రాగానే నిధులు కేటాయిస్తామని తెలిపారు.

## బాసర బ్రిడ్జ్ పై రక్షణ ఏర్పాట్లు నిర్మల్ ఎస్ పీ జానకి షర్మిల

**హైదరాబాద్ పెన్ పవర్:**బాసర గోదావరి నది బ్రిడ్జ్ ని జిల్లా ఎస్పి డా.జానకి షర్మిల బుధవారం సందర్శించారు. ఆమె వెంట భైన్సా ఏ ఎస్పి అవినాష్ కుమార్, ముధోల్ సీ ఐ మల్లేష్, బాసర ఎస్సై గణేష్ లున్నారు. తరువాత స్థానిక పోలీస్ స్టేషన్ లో పోలీస్ అధికారులతో కలసి రివ్యూ సమావేశం నిర్వహించారు.ఎస్పీ మాట్లాడుతూ నేను చార్జ్ తీసుకున్న గత సంవత్సరం నుండి బాసర బ్రిడ్జ్ పై ఆత్మహత్య లు నన్ను కదిలించాయి. ప్రభుత్వ సహాయం తో బాసర బ్రిడ్జి పై ఇరు వైపులా సుమారు ఆరు ఫీట్ల జాలిలు , సిసి కెమెరా లు ఏర్పాటు చేసి బాసర పోలీస్ స్టేషన్ కి అనుసంధానం చేస్తాం.. 24/ 7 ఇద్దరు మహిళా కానిస్టేబుల్ లతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు బాసర బ్రిడ్జ్ పై బ్లూకోట్ సిబ్బందిని నియమిస్తాం. ఎల్లవేళలా గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంచి ఆత్మహత్య ల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని అన్నారు. బాసర బ్రిడ్జి పై సగ భాగం నిజామాబాద్ జిల్లా పరిధి లో ఉండటం తో నిజామాబాద్ సీపి తో మాట్లాడి వారి సమన్వయం తో ఆత్మహత్య ల నివారణకు నిర్మల్ జిల్లా పోలీస్ యంత్రాంగం కట్టుబడి ఉందని అన్నారు. .

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో మెగా హెల్త్ క్యాంప్..,

**హైదరాబాద్ పెన్ పవర్:**మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ అన్నారు. రామగుండము పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జిల్లాలోని మారుమూల మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో నీల్వాయి పోలీసుల ఆధ్వర్యంలో దస్నాపూర్ క్రాస్ రోడ్ వద్ద ఉన్న ఆశ్రమ పాఠశాలలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కమిషనర్ ఎం.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వేమన్ పల్లి మండలం కల్లంపల్లి, రాజారాం, సంపుటం, దస్నాపూర్, గొర్లపల్లి, కొత్తకాలనీ, జిల్లెడ, జక్కేపల్లి, బుయ్యారం, రాచర్ల, ముల్కల్పేట్, ముక్కిడిగూడెం, సీతారా, చామనపల్లి, బద్దంపల్లి, బమ్మెనా, ఒడ్డుగూడెం, నాగారం, కేతన్పల్లి, కల్మల్పేట గ్రామాల నుండి సుమారు 800 మంది ఈ వైద్య శిబిరానికి హాజరయ్యారు. అన్ని విభాగాలలో నిపుణులైన వైద్యుల బృందం సహాయంతో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

## కేంద్ర నుంచి చట్ట ప్రకారం రావాల్సిన నిధులు తెస్తున్నాం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**హైదరాబాద్ పెన్ పవర్:**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రిగా నేను, మా సహచర మంత్రులు ఎప్పటికప్పుడు కేంద్ర మంత్రులను కలిసి సమాఖ్య స్ఫూర్తిని గౌరవిస్తూ చట్ట ప్రకారం మాకు రావాల్సిన నిధుల వాటా ఇంత ఉంది ఆ మేరకు నిధులు ఇవ్వాలని కోరుతున్నాం ఆ మేరకు నిధులు తీసుకొస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. బుధవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వివిధ పథకాల కింద రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధుల వివరాలపై ప్రశ్నించగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వం పది ఏళ్లలో సాధించిన దాని కంటే మా ప్రభుత్వం కేంద్రం నుంచి అధికంగా నిధులు సాధించిందని డిప్యూటీ సీఎం వివరించారు. గత పది సంవత్సరాలుగా కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన నిధులు, గత ఏడాది కాలంగా కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన నిధుల వివరాలతో తాను సభకు వచ్చానని తెలిపారు. కేంద్రం రాష్ట్రానికి నేరుగా నిధులు కేటాయించదు, ఆ ప్రభుత్వం నిర్దేశించుకున్న ప్రత్యేక పథకాల ద్వారా నిధులు కేటాయిస్తుందని వివరించారు. మా ప్రభుత్వం ప్రతి విషయంలోనూ పారదర్శకంగా ఉంటుంది, మేము ఏ వివరాలను దాచుకునే వాళ్ళం కాదని అన్నారు. కేంద్రం జీఎస్టీ బిల్లును తీసుకురాగా గత ప్రభుత్వం మద్దతునిచ్చిందని.. ఆ తర్వాత వారు బిజెపితో వైరం పెట్టుకున్నారని అన్నారు.

## కాంగ్రెస్ ఛలో రాజ్ భవన్ కార్యక్రమం

### హాజరయిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి



**హైదరాబాద్ పెన్ పవర్:** అదానీ ఆర్థిక అవకతవకలపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఛలో రాజ్ భవన్ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున కదిలారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇంచార్జ్ దీప దాస్ మున్షి, టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు,ఎంపీలు,ఎమ్మెల్యేలు, పాల్గోన్నారు. అమెరికా లో గౌతమ్ ఆధాని పై వచ్చిన ఆర్థిక అవకతవకలు దేశ వ్యాపార, ఆర్థిక రంగాలలో పరువును దెబ్బతీసాయి. ఆధాని పై ఆర్థిక అవకతవకలు, నేరారోపణలు, అవినీతి, మోసం, మని లాండరింగ్, మార్కెట్ మనిపులేషన్ లాంటి అంశాలలో ఆయనపై ఆరోపణలు దేశ ప్రతిష్టను దెబ్బతీసాయని అలాగే మణిపూర్ లో వరసగా జరిగిన అల్లర్లు, విధ్వంసాలపై మోడీ ఇప్పటి వరకు అక్కడకు వెళ్లలేదంటూ అందోళనకారులు నినాదాదు చేసారు.

## ఆటోలో అసెంబ్లీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆటోలో అసెంబ్లీకి వచ్చారు. ఆ పార్టీ ఎమ్మెల్యే కేటీఆర్ స్వయంగా ఆటోను నడిపారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ.. ఆదర్శ్ నగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి అసెంబ్లీకి ఆటోల్లో చేరుకున్నారు. తక్షణమే ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం ప్రకటన చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు మద్దతుగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ? కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో 8 లక్షల మంది ఆటో డ్రైవర్లకు ఎన్నో హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ హామీలు ఏవీ అమలు కాలేదని? ఇప్పటివరకు 93 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని చెప్పారు. గత అసెంబ్లీ సమావేశాల్లోనే ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల జాబితాను అందించామని కేటీఆర్ చెప్పారు. అయినా రాష్ట్ర ప్రభుత్వానికి దున్నపోతు మీద వాన పడ్డట్లే ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి ఇస్తామన్న 12 వేల రూపాయలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పారని? వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఆటో డ్రైవర్లు ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని కేటీఆర్ పిలుపునిచ్చారు. వారిపక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని చెప్పారు. ఆటో డ్రైవర్లకు సంఘీభావంగా ఆటోల్లో అసెంబ్లీకి వచ్చామన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో?. ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ అసెంబ్లీలో వాయిదా తీర్మానం కూడా ఇచ్చింది.

## ఏసీబీ చేతికి అస్త్రం- ఏ క్షణంలోనైనా కేటీఆర్ మీద విచారణ, అరెస్టుకు ఛాన్స్!

**హైదరాబాద్ పెన్ పవర్:**ఫార్ములా ఈ-రేస్ విచారణ కొరకు తెలంగాణ సీఎస్? ఏసీబీకి లేఖ రాశారు. నిధుల దుర్వినియోగం పై విచారణ జరపాలని కోరారు. ఈ మేరకు గవర్నర్ అనుమతి ఇచ్చిన లేఖను జత చేశారు. దీంతో ఈ కేసులో విచారణ షురూ కానుంది. ఈ కేసులో కేటీఆర్ ను విచారించే అవకాశం ఉంది. ఫార్ములా-ఈ రేసు వ్యవహారంపై విచారణ జరిపేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. ఈ కేసులో కేటీఆర్‌పై విచారణ జరిపేందుకు ఇటీవలనే గవర్నర్ అనుమతి ఇవ్వటంతో? విచారణ ప్రక్రియ షురూ అయ్యే అవకాశం ఉంది. ఇందులో భాగంగా?. ఈరేసు వ్యవహారంపై విచారణ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏసీబీకి లేఖ రాశారు. గవర్నర్ అనుమతి లేఖను కూడా ఇందుకు జత చేశారు. సీఎస్ లేఖ రాయటంతో ఏసీబీ విచారణ షురూ చేయనుంది. ప్రాథమికం ఆధారాల ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి? పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసే అవకాశం ఉంది. ఫార్ములా ఈరేస్ కేసులో రూ. 50 కోట్లకుపైగా నిధులు దారి మళ్లియాని ప్రభుత్వం ఆరోపిస్తోంది. అధికార దుర్వినియోగం జరిగిందని? ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరిపించాలని నిర్ణయించింది. ఇందుకు కేబినెట్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో? ఫార్ములా ఈరేసు కేసు ఏసీబీకి చేతుల్లోకి వెళ్లనుంది. నిజానికి ఈ వ్యవహారంలో జరిగిన చెల్లింపులపై ఇప్పటికే పురపాలక శాఖ ఏసీబీకి ఫిర్యాదు చేసింది. హెచ్ఎండీఏ ఒప్పందం, ఆర్‌బీఐ అనుమతి లేకుండా రూ.46 కోట్ల మేర విదేశీ కరెన్సీ చెల్లించడం వంటి అంశాలను ఏసీబీ దృష్టికి తీసుకెళ్లింది. పురపాలకశాఖ అప్పటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ తో పాటు మరికొందరు అధికారుల పేర్లను కూడా ప్రస్తావించింది. ఇక అప్పుడు మంత్రిగా కేటీఆర్ ఉన్నారు. దీంతో ఆయన పేరును కూడా పేర్కొంది. అధికారులపై విచారణకు అనుమతి ఉన్నప్పటికీ? కేటీఆర్ పై విచారణ జరిపేందుకు గవర్నర్ అనుమతిని కోరింది. ఇందుకు ఇటీవలే గ్రీన్ సిగ్నల్ రావటంతో?. సీఎస్ ఏసీబీకి లేఖ రాశారు. హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేసు వ్యవహారంలో హెచ్ఎండీఏ ఒప్పందం చేసుకోవడం, ఆర్‌బీఐ అనుమతి లేకుండా విదేశీ కరెన్సీ చెల్లించడంపై పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అయితే మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసు నమోదు చేయడానికిగానూ గవర్నర్‌ను ప్రభుత్వం అనుమతి కోరింది. దాదాపు నెల రోజుల తరువాత గవర్నర్ అనుమతి ఇవ్వడంతో కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌కు కీలకమైన కేటీఆర్‌ను విచారించేందుకు సిద్ధమైంది. మరోవైపు అసెంబ్లీ సమావేశాలు పొడిగించాలని, సాధ్యమైనన్ని అంశాలపై చర్చించే దమ్ముందా అని కేటీఆర్ సవాల్ విసిరిన గంటల వ్యవధిలో సీఎస్ నుంచి ఏసీబీకి బీఆర్ఎస్ నేతను విచారించేందుకు రంగం సిద్ధమైంది.

# తెలంగాణలో అసెంబ్లీలో భూభారతి బిల్లు

### దోచుకున్న భూములు స్వాధీనం చేసుకుంటామని మంత్రి హెచ్చరిక

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో ఆర్‌వోఆర్ చట్టం-2020ను పూర్తిగా ప్రక్షాళన చేసిన ప్రభుతవం కొత్తగా భూభారతి బిల్లును తీసుకొచ్చింది. అనేక రోజులు పరిశోధనల తర్వాత దీన్ని రూపొందించినట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభలో ప్రకటించారు. ఈ బిల్లు ఏర్పాటుకు ప్రతిపక్షాలు కూడా సలహాలు సూచలు చేశాయని గుర్తు చేశారు. ఈ బిల్లుతో తెలంగాణలోని ప్రతి ఇంచు భూమికి రక్షణ దొరుకుతుందని అభిప్రాయపడ్డారు. ప్రజల భూముల రక్షణతోపాటు కబ్జాదారుల భరతం పట్టేందుకు ఈ బిల్లు సహకరిస్తుందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. పదేళ్లు భూములను కబ్జాలు చేసిన వారి పని పడతామని సభా వేదికగా హెచ్చరించారు. ప్రజల భూములనుకంటికి రెప్పలాకాపాడుకుంటా మన్నారు. అనాలోచితంగా తీసుకొచ్చిన ధరని పోర్టల్ వల్ల ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని చెప్పుకొచ్చారు. ఇందులో ఉన్న ఇబ్బందులు బీఆర్ఎస్ నేతలకి కూడా తెలుసన్న మంత్రి... ఇబ్బందులు వస్తాయని వారు నోరు విప్పడం లేదన్నారు. రెవెన్యూ అధికారుల దగ్గర పరిష్కారం కావాల్సినవి కూడా కోర్టులకు చేరాయని మంత్రి పొంగులేటి చెప్పారు. భూయజమానికి తెలియకుండానే భూమి చేయి దాటిపోయిందని ప్రస్తావించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొత్త ముసాయిదా సిద్ధం చేశామన్నారు. పలు రాష్ట్రాల్లో ఆర్వోఆర్ చట్టాలను పరిశీలించి ఈ చట్టాన్ని తీసుకొచ్చామని చెప్పారు. ధరణిలో అనేక లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. వాటన్నింటిని సరిదిద్దేలా? కొత్త ముసాయిదా తీసుకొచ్చామని చెప్పారు. తహసీల్దార్లతోపాటు ఆర్డీవోలకూ మ్యుటేషన్ చేసే అధికారం ఇచ్చేలా ముసాయిదా రూపొందించారు. మ్యుటేషన్ సమయంలో విచారణకు అవకాశం కల్పిస్తుండగా? తప్పుగా తేలితే మ్యుటేషన్ నిలిపివేసే అధికారాలను కట్టబెట్టనుంది. ప్రతి భూకమతానికి భూ ఆధార్ ఉండనుంది. హక్కుల బదలాయింపు జరగ్గానే గ్రామ పహాణీలో నమోదయ్యేలా చర్యలు తీసుకుంటారు. అప్పీల్, రివిజన్‌లకు వెసులుబాటు కల్పిస్తూ బిల్లును రూపొందించారు. గతంలో అప్పీల్ కు అవకాశం లేకుండా చట్టం చేశారని మంత్రి పొంగులేటి చెప్పుకొచ్చారు. ఆర్వోఆర్ రికార్డుల్లో తప్పులుంటే వాటిపై మొదటి అప్పీలుపై రివిజన్ అధికారాలు కలెక్టర్ లేదా అదనపు కలెక్టర్‌కు ఇవ్వనున్నారు, ఇక రెండో అప్పీలుపై సీసీఎల్ఏకు, మూడో అప్పీలుపై ప్రభుత్వానికి చేసుకునే వీలు ఉంటుందికొత్త బిల్లుపై ప్రతిపక్ష పార్టీలు అభ్యంతరం చెప్పాయి. కనీసం సమయం ఇవ్వకుండా అర్ధరాత్రి ముసాయిదా బిల్లును వెబ్ సైట్ లో ఉంచారని.. ఇలా ఉంటే ఎలా ప్రిపేర్ అవుతారని అభ్యంతరం చెప్పారు. ఇవాళే సభలో ప్రవేశపెట్టి.. ఆమోదముద్ర వేయటం సరికాదని ఎంఐఎం, బీఆర్ఎస్, సీపీఐ, బీజేపీ సభ్యులు చెప్పుకొచ్చారు. రేపు పూర్తిస్థాయిలో చర్చ జరగాలని కోరారు. సభ్యులకు సవరణ ప్రతిపాదన అవకాశం ఇవ్వాలని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ? స్పీకర్ అనుమతి ఇస్తే రేపు చర్చ జరుపుతామని ప్రకటించారు. ధరణితో కొందరికే మేలు జరిగిందన్న మంత్రి పొంగులేటి... లక్షల మంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కాకపోవడంతో అధికారుల చుట్టూ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. భూయజమానులకు తెలియకుండానే రికార్డులు తారుమారు అయ్యేవని అందుకే దీన్ని పూర్తిగా బంగాళాఖాతంలో కలిపేసి ప్రజాభిష్టం మేరకు కొత్త చట్టం తెచ్చామని పేర్కొన్నారు. ఇప్పుడు తీసుకొచ్చిన చట్టం రూపొందించడానికి లక్షల మంది ప్రజల అభిప్రాయాలు, రిటైర్డ్ ఉద్యోగుల ఆలోచనలు, ప్రతిపక్షాల మాటలను కూడా పరిగణలోకి తీసుకున్నామని తెలిపారు మంత్రి. హరీష్‌రావు, వినోద్ కుమార్ లాంటి వాళ్లు కూడా సలహాలు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రశ్నోత్తరాల టైంలో సభలో మంత్రులు, హరీష్ రావు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. తెలంగాణలో రోడ్ల అంశంపై అడిగిన ప్రశ్నకు మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ మామ చాటు అల్లుడిగా ఉంటూ వేల కోట్లు దోచుకున్నారని కూలిపోయే కాళేశ్వరం కట్టారని విమర్శించారు. వాళ్లకు కమిషన్లు తీసుకోవడమే తెలుసని.. ప్రజలకు మంచి చేయడం తెలియదన్నారు. ఉప్పల్‌లో ఓ ఫ్లైఓవర్ పూర్తి చేయని వాళ్లు తమ ఫామ్‌హౌస్‌లకు నాలుగు లేన్ల రోడ్లు వేసుకున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే మార్చి నాటికి భూసేకరణ పూర్తి చేసిన నాలుగేళ్లలో ట్రిబుల్ ఆర్ పూర్తి చేస్తామన్నారు. దీనికి కౌంటర్‌గా హరీష్‌రావు మాట్లాడుతూ.. తాను కమిషన్ తీసుకున్నట్టు నిరూపించాలని సవాల్ చేశారు. కొంతమంది సభ్యులు సభకు తాగి వస్తున్నారని అందుకే డ్రంకన్ టెస్టు పెట్టాలని సభాపతికి సూచించారు. కోమటి రెడ్డి కమిషన్ల చిట్టా విప్పితే తట్టుకోలేరని హెచ్చరించారు. తనపై ఆయన చేసిన కామెంట్స్ రికార్డుల నుంచి తొలగించాలన్నారు. హరీష్‌రావు కామెంట్స్‌ను మరో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖండించారు. ఇలాంటి మాటలు సరికాదని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన కామెంట్స్ కేసీఆర్‌ను గుర్తుకు తెచ్చినట్టు ఉందన్నారు విప్ బీర్ల ఐలయ్య. స్పీకర్ జోక్యం చేసుకొని హరీష్, బీర్ల ఐలయ్య మాటలు రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు చెప్పుకొచ్చారు.



# అమరావతిపై పొంగులేటి వివాదాస్పద వ్యాఖ్యలు

**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ హోరాహోరీ పోరు సాగుతోంది. బీఆర్ఎస్ నేతలు ముప్పేట దాడి చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు కౌంటర్లు ఇస్తున్నారు. అయితే ఇది సమిష్టిగా జరగడం లేదని కొన్ని కొన్ని సందర్భాల్లో బయటపడుతూనే ఉంది. కొంత మంది సందర్భం లేని వివాదాలను తెచ్చుకుంటున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి పదవి కోసం పరుగులు పెడుతున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇరువులు చిట్ చాట్‌ల పేరుతో చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. వీరి ఎజెండా ఏమిటన్నదానిపై చర్చ ప్రారంభమయింది. అమరావతి విషయంలో మీడియా చిట్ చాట్‌లో వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లుగా కొన్ని మీడియా సంస్థలు రిపోర్టు చేశాయి. ఆయన అన్ని మీడియా సంస్థల ప్రతినిధుల్ని ఈ చిట్ చాట్‌కు పిలవలేదు. అమరావతిలో పెట్టుబడులు పెట్టడానికి చాలా మంది భయపడుతున్నారని పొంగులేటి చెప్పుకొచ్చారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో తెలంగాణ పెట్టుబడులు ఆంధ్రకు వెళ్తాయేమోననే అభిప్రాయం ఉండేదని, ఇటీవల అమరావతిలో సంభవించిన వరదలతో ఆ భావన పోయిందని చెప్పినట్లుగా మీడియాలో వార్తలు వచ్చాయి. వాళ్లు ఎంత బూస్టప్ ఇవ్వాలనుకున్నా సాధ్యం కావడం లేదు. ఎలాంటి చర్యలు తీసుకున్నా వరదల నుంచి రక్షణ ఉండదని పెట్టుబడిదారులు భావిస్తున్నారని ఆయన చెప్పుకొచ్చారు. ఎంత తీవ్రమైన వరదలు అమరావతి మునగలేదు. బుడమేరు వల్ల విజయవాడకు ఎంత ఎఫెక్ట్ అయిందో ఖమ్మం కూ అంతే ఎఫెక్ట్ అయిందని పొంగులేటి మర్చిపోయారన్న విమర్శలు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. పొంగులేటి చేసిన వ్యాఖ్యల వార్తల క్లిప్పింగ్‌కు పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కౌంటర్ ఇచ్చారు. చంద్రబాబు నాయుడు గారు అధికారంలోకి వచ్చాక అమరావతితో పాటు అన్ని ప్రాంతాలు అభివృద్ధికి నాందిపలికాయన్నారు. జగన్ మోహన్ రెడ్డి అనుంగులు విధిగా చేసే వ్యాఖ్యలే ఇపుడు పొంగులేటి చేస్తున్నారని.. జగన్ మోహన్ రెడ్డి మిత్రత్వం వాసనలు ఇంకా పోలేదా అని ప్రశ్నించారు. ఎన్టీఆర్ ఘాట్ లేపేసి కొత్త అసెంబ్లీ భవనం కడితే బాగుంటుంది మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి డియాతో చిట్ చాట్ లో వ్యాఖ్యానించారు. తెలంగాణలో ప్రస్తుతం ఉన్నటువంటి అసెంబ్లీ భవనం చాలా ఓల్డ్ ది అని.. సచివాలయం కొత్తది అని తెలిపారు. సచివాలయం, అసెంబ్లీ పక్క పక్కన ఉంటే పరిపాలనకు చాలా సులభంగా ఉంటుందని చెప్పుకొచ్చారు. ఈ వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకంగా చేశారని ఎవరికైనా అర్థమవుతుంది. ఆ ఉద్దేశం ఏమిటన్నదానిపై కాంగ్రెస్‌లోనే చర్చ జరుగుతోంది. మరో వైపు ఏపీ పాలకులు ఎప్పుడూ హైదరాబాద్ గురించి కానీ తెలంగాణ గురించి కానీ నెగెటివ్ కామెంట్స్ చేయలేదు.